# సంధ్యా సమస్యలు

ప్రొద్దుపోయిందన్నమాటేగానీ మండుటెండలకు దగ్గరిచుట్టాలైన పదమటి వడగాడ్పుల విసురుల్లో లోకం వెచ్చిపచ్చిగా ఉడికిపోతోంది. అలవాటు ప్రకారం వాహ్యాళికి వెళ్ళి తిరిగివచ్చిన రిటయిర్డు డిప్యూటీ కలెక్టరు రాఘవేంద్రరావుగారు అంగవస్త్రంతో ముఖంమీది చిరుచెమటను తుడుచుకుంటూ చేతికర్రను టేబిలుకానించి వాలుకుర్చీలో కూలబడిపోయారు. మాటిమాటికీ కుడిచేతి చూపుడు వ్రేలితో గాలిలో వలయాలు గీస్తుండడంవల్ల నైతేనేమి, క్రింది పెదవిని పైపళ్ళతో నొక్కి అరమోడ్పు కళ్ళతో కూర్చుని వుండడంవల్లనైతే నేమి, ఆస్థితిలో పరిచితులెవరైనా చూడడం గనుక తటస్థించివుంటే, ఆయన మనసులో ఏదో ఆందోళన రగులుకుంటోందని యిట్టే గ్రహించివుండేవారు.

ఇంత చిరాకుకలిగించే విషయ మొకటి తన చుట్టుప్రక్కల్లోనే యింతై, అంతై కడకు విశ్వరూపం ధరిస్తోందన్న సంగతి ఆయనకారోజు ఉదయం ఆరుగంటలవరకూ తెలియదు.

నిద్రాభంగం కావడంతో ఆయన ఆరోజు ఉదయం ఉలికిపడి కళ్లు తెరిచారు. ద్వారంలోనుంచి వంటమనిషి అంజయ్య, ముఖాన్ని మాత్రం లోపలికి చూపిస్తూ "మీ కోసం ఎవరో వచ్చారు బాబూ!" అంటున్నాడు.

వంటమనిషి అంజయ్యముఖంపట్ల రాఘవేంద్రరావుగారి కెన్నడూ సదభిప్రాయం లేదు. ఉదయం లేవగానే అతడిముఖం తన కళ్ళబడినరోజున ఏదో అవాంతరం తప్పకుండా జరిగితీరుతుందని సకారణంగానో, అకారణంగానో ఒక నమ్మకం యేర్పడి, అది ఆయన అంతరంగంలో అలాగే సుస్థిరంగా వుండిపోయింది.

ఇంటిలో రాఘవేంద్రరావుగారికన్నా ముందుగా నిద్రలేచేవాడెవడైనా వుంటే వాడొక్క వంటమనిషి అంజయ్య మాత్రమే కావడంవల్ల ఆయనకు ప్రతిరోజూ యేవో అవాంతరాలు సంభవిస్తున్నట్టే తోచేది.

ఐతే యిక్కడ అవాంతరాలన్న పదానికి నిఘంటవులిచ్చే అర్థాన్ని మాత్రం అన్వయించుకోగూడదు.

రాఘవేంద్రరావుగారి దృష్టిలో టూత్ బ్రష్ కనిపించకపోవడమూ, గేటుదగ్గర పందిరి కల్లుకుంటున్న పువ్వులతీగను మేకలు మేసిపోవడం లాంటివన్నీ అవాంతరాల క్రిందే జమవుతాయి.

విసుక్కుంటూనే పడకమీదనుంచీ లేచి కతిపయద్వారాలు గడచి రాఘవేంద్రరావు గారు హాల్లోకి వచ్చేసరికి అక్కడ ఆయనకోసం చిరుగులుపడిన పాతకోటు జేబులనిండా కాగితాల పొత్తర్లతోనూ, కమ్మివిరిగి నూలుపోగుతో మిగిలిన సులోచనలతోనూ, ముక్కుపుటాలపైన నశ్యంమరకలతోనూ, కొండకోనల్లో ఎక్కుడు మార్గంపైన రెండుఫర్లాంగుల పొడవున్న గూడ్సు వాగన్లను లాగలేక, లాగలేక,లాక్కుపోతున్న ధూమశకటంలాంటి వ్యక్తి ఒకడు, కుర్చీలో చతికిలపడివున్నాడు.

అతణ్ణి చూడగానే రాఘవేంద్రరావు గారి ముఖంలో ఒక ఆశ్చర్యరేఖ మెరిసిందంటే, అందుకు ప్రబలమైన కారణం వుంది. కూటికి పేదయినా నీలకంఠం కులానికి పేదకాడు. ఆర్థికంగా కుటుంబాల అంతస్థుల్లో విభేదాలున్నప్పటికీ, సంఘంలో బంధులోకానికంతటికీ సమాన గౌరవప్రతిపత్తులు లభ్యం కావాలని గట్టిగా పట్టుబట్టే మనిషి నీలకంఠం! అతడు రాఘవేంద్రరావుగారికి స్వయానా పెదతండ్రికొడుకేనన్న విషయం ఊళ్ళో చాలామందికి తెలియదు. ఆ విషయాన్ని నలుగురికీ ప్రకటించవలసిన అవసరం రాఘవేంద్రరావు గారికైతే లేకపోవచ్చుగానీ, ఆమాత్రం విజ్ఞత నీలకంఠానికెందుకు లేకపోవాలని అతనికీ రాఘవేంద్రరావుగారికీ వున్న రక్తసంబంధాన్ని గురించి తెలిసిన ఏ కొద్దిమందో ఆలోచించక పోలేదు.

ఆ విషయాన్ని అలా బాహాటంగా చెప్పుకోకపోవడానికి వెనుక ఈ ఎనిమిదిబిడ్డల తండ్రి, జరాభారంతోబాటు కుటుంబభారాన్ని మోయలేక సతమతమైపోతున్న ఈ బక్క పలుచటి మనిషి, ఈ వకీలుగుమాస్తా, నీలకంఠం ఎంత ఆత్మాభిమానాన్ని పాతర పోసివున్నాడో వాళ్ళకు తెలియదు.

కానీ ఈ అవకాశాన్ని పురస్కరించుకుని రాఘవేంద్రరావుగారు తిన్న చేతితో కాకి నదలించని కఠినమనస్కుడని అంచనా వేయడంమాత్రం పెద్ద పొఱబాటే ఔతుంది. ఉద్యోగంచేసిన రోజుల్లో డబ్బు వెనకేసుకుని బ్యాంకులో దాచుకున్నాడుగదా అని అతివినయాన్ని నటిస్తూ తన పజ్జచేరిన బంధువులకు ఒక్కకానీ అయినా విదల్చనిమాట నిజమే అయినా నీలకంఠం విషయంలో మాత్రం ఆయన అభిప్రాయం వేరు, నీలకంఠానికి సాటి మానవునిముందు నిలబడి చేతివ్రేళ్ళు నులుముకుంటూ దైన్యం ప్రదర్శించడం చేతకాదు. ఎప్పటికప్పుడు రాఘవేంద్రరావుగారు ఈసారి నీలకంఠం తన సహాయాన్ని

అర్థించకతప్పదు అని అనుకుంటూనే వున్నారు, మరొకవైపున నీలకంఠం దిక్కులుతెలియని సంసారసాగరంలో తుపానుల్ని సరకుచేయకుండా నిస్సహాయంగా ఈదుకుంటూనే వస్తున్నాడు. అలాటి నీలకంఠం తెల్లవారకముందే యిలా ప్రత్యక్షమయ్యేసరికి రాఘవేంద్రరావుగారు కొంత తబ్బిబ్బుపడక తప్పిందిగాదు.

"నువ్వు మరికొంతసేపు నిద్రపోయేవాడివేమో! నా మూలంగా నీ నిద్ర పాడైవుంటుంది" అన్నాడు నీలకంఠం.

అతడిమాటల్లో క్షమాపణ ధ్వనిస్తున్నందుకు కించపడుతూ "అబ్బే! పరవాలేదులే నీలకంఠం! నా నిద్రమాటకేంగానీ, ఎన్నడూ లేంది అత్తిపూచినట్టు ఈ రోజు నువ్వు యిల్లు ద్రొక్కిరావడమే గొప్ప! ఏమిటి విశేషాలు?" అన్నారు.

పై కప్పుకేసి చూస్తూ నీలకంఠం ఉపోద్ఘాతం అవసరమా, అనవరసమా అని కాసేపు ఆలోచించిన తర్వాత, అదంతా ఎందుకనుకున్నట్టు సరాసరి అసలు విషయాన్నే ప్రస్తావించేశాడు.

"అదికాదు రాఘవేంద్రం! నువ్వు ఉద్యోగంనుంచీ రిటయిరైనమాట నిజమే! కాదనను. కానీ ప్రాపంచిక వ్యవహారాలేవీ పట్టించుకోకుండా తామరాకుమీద నీటిబొట్టులా కూచోడానికి ముందు నువ్వు స్వార్థంగానూ, పరార్థంగానూ చేయవలసిన పనులు కొన్ని వున్నాయి. నామటుకు నావిషయాన్ని చూడు! ఈడొచ్చిన అమ్మాయిలిద్దరు యింట్లోవున్నారు. తీరామారా వీళ్ళకు సంబంధాలు కుదిరి పెళ్లి జరిగేలోపల కడగొట్టుపిల్లకు కూడా వయసొచ్చేస్తుంది. పరిస్థితి యిలా వుందా! పిల్ల కావాలంటూ కడపతొక్కివచ్చి అడిగేనాధుడుమాత్రం కనిపించడంలేదు. ఆడబిడ్డల్ను కన్ననేరానికి యిక మాయింట్లో అమ్మాయిలున్నారండోయ్ అని బాకావూదుతూ తిరగాలంటే అది నాబోటివాడికి సాధ్యమయ్యేపనిగాదు.ఏం చేయమంటావు? రాత్రంతా నిద్రపట్టకపోతే తెల్లవారకముందే లేచి నిన్ను సలహా అడుగుదామని యిలా పరుగెత్తివచ్చేశాను".

రాఘవేంద్రరావుగారు ఒకటి రెండు క్షణాలపాటు ఆలోచించి "దానికేముంది నీలకంఠం! నువ్వు నాతో చెప్పావుగదా! ఇకమీదట యిది నీపనిగాదు, నాపని అనుకో! నేను శక్తివంచనలేకుండా ప్రయత్నిస్తాను" అంటూ హామీ యిచ్చారు.

"రక్షించావు బాబూ!" నీలకంఠం తేలిగ్గా పైకిలేస్తూ అన్నాడు "ఇకనేను నిశ్చింతగా వుండవచ్చునన్నమాట! వెళ్ళొస్తాను మరి!"

"ఉండుండు, కాఫీతీసుకుని వెళ్దువు గానీ" అని రాఘవేంద్రరావుగారు అడ్డుతగులుతుండగానే "కాఫీ కేంలే, రాఘవేంద్రం! అవతల బోలెడన్ని పనులున్నాయి. మళ్ళీవస్తానులే" అంటూ నీలకంఠం చరచరా వెళ్ళిపోయాడు.

కాఫీ అయినతర్వాత నీరెండలో రాఘవేంద్రరావుగారు చెక్కు మార్చుకోడానికోసం ట్రెజరీదాకా వెళ్ళిరావలసిన పని బడింది.

డబ్బు జేబులోవుంచుకుని కచేరి మెట్లు దిగుతుండగా వెనుకనుంచీ ఎవరో "వెళ్లిపోతున్నారా బాబాయ్! నేనూ వస్తున్నా" అన్నారు.

రాఘవేంద్రరావుగారు వెనుదిరిగి చూచారు. ఆగంతుకుడి పేరు సీతారామయ్య. మనిషి మంచి లౌక్యుడు. పెద్దచదువులు చదవకపోయినా, పితృపారంపర్యంగా సంక్రమించిన కరణీకం వల్ల గ్రామం తన చెప్పు చేతుల్లో వుండగా బ్రతుకు నొకవిధంగా వెళ్ళదీసుక పోతున్నాడు. రాఘవేంద్రరావుగారికి తాశీల్ధారుగా ప్రమోషను వచ్చిన క్రొత్తలో అప్పుడే కరణీకం చార్జీపుచ్చుకున్న పంతొమ్మిదేళ్ళ కుర్రాడు సీతారామయ్య, నేరుగా తాలూకాఫీసులో ప్రవేశించి తాశీల్దారుగారిని "బాబాయ్" అని సంబోధించాడు. రాఘవేంద్రరావుగారు నివ్వెరపోయి ఆ చుట్టరికపు లోతుపాతుల్నీ ఆరాతీయగా కడకు ఆ కుర్రాడేమంత దూరపు బంధువు కాడనీ, తనతల్లి పినతండ్రికి తోడల్లుడి పౌత్రుడేననీ వాస్తవం పైకి తేలింది.

అదంతా మనకిప్పుడు అప్రస్తుతం!

"సరిగ్గా సమయానికి కనిపించావోయ్" అంటూ రావుగారు పరుగుపరుగునా మెట్లు దిగివచ్చిన సీతారామయ్యకు తన గొడుగు నీడ క్రింద కాస్త చోటిచ్చి "ఈ మధ్య ఎక్కడా కనిపించడం లేదే! నీతో ఒక విషయం చెప్పాలనుకుంటున్నాను" అన్నారు.

"అరే, చిత్రంగావుందే బాబాయ్! నేనూ ఒక విషయం చెప్పాలనే యిలా పరుగులుబారి వస్తున్నాను. పోనీ, మీ విషయమేదో మొదటచెప్పేయండి" అన్నాడు సీతారామయ్య.

"ఏం లేదు. నీ ఎరుకలోమంచి కుర్రాడెవడైనా వుంటే తీసుకొస్తావా?" రావుగారు సూటిగా ప్రశ్నించారు.

"ఉద్యోగమేదయినా ఖాళీగా వుందా బాబాయ్?"

"ఉద్యోగం కాదు. సాలంకృత కన్యాదానం"

"అదే, అదే! నే నదుగదలచుకున్నదీ అదే బాబాయ్! పెళ్ళీడొచ్చిన పిల్లను యింట్లో వుంచుకుని నాలుగేళ్లుగా చెప్పులరిగేటట్టు దేశం చుట్టేశాను. మరి నేనేమో మహా

తెలివైనవాడిననుకుంటుంది లోకం! నా తెలివితెల్లవారినట్టే వుంది. ఈ విషయంలో మీరు నాకేదయినా దోవ చూపించక తప్పదు బాబాయ్!"

రావుగారు తెల్లబోయినప్పటికీ తమాయించుకుని "త్రోవ చూపించగలని నేను పూచీపడలేను సీతారామయ్యా! కానీ ఈ విషయాన్ని జ్ఞప్తిలో వుంచుకుంటాను' అన్నారు.

"మంచిది, ఆ మాటే నాకుచాలు. వెళ్ళొవస్తాను బాబాయ్" అని, అంతటితో తనపని తీరిపోయినట్టు సీతారామయ్య వెనుదిరిగి కచేరివైపు వెళ్లిపోయాడు.

తనొక సమస్యను పరిష్కరించాలనుకోడమేమిటి? అది చాలక దానికి మరొకటి తోడుగావడమేమిటి? రావుగారికి అక్షణాన గలిగిన చిరాకు సాయంత్రంలోపుగా యింకా యిద్దరు ముగ్గురు ఆడపిల్లల పెళ్ళి సంబంధాలు కుదిర్చిపెట్టమని అభ్యర్థించడంతో మరీ మోతాదు మీరిపోయింది.

ఆ యిద్దరు ముగ్గురిలో ఒకతనేమో బడిపంతులు. రావుగారు ఎంతటిదుర్భర వేదనాభరిత దుఃఖజీవిత గాథలనయినా ఊ కొట్టగలరు గానీ ఈ బడిపంతులనే పేరిట చలామణీ అయ్యే దీనమానవుడి గోడును, అతడి ముఖతరహా మాత్రం వినలేరు, వింటే ఆ రోజు కిక ఆయనకు అన్నం సహించదు. నిద్రపట్టదు.

పైగా ఆ రోజు రావుగారికి తారసిల్లిన బడిపంతులు మాటలసందర్భంలో తనకు ముగ్గురు కూతుళ్ళున్నట్టు చెప్పుకున్నాడు. విశేషమేమిటంటే ఆ ముగ్గురికీ వయసులో తారతమ్యం వున్నా దూరంనుంచీ చూస్తే మాత్రం అందరూ కవల పిల్లలా కన్పిస్తారట!

"ఈ సంవత్సరం ఒకరికో యిద్దరికో పెళ్ళిగాకపోతే ఆ తర్వాత నిభాయించుకోవడం కష్టం" అని కళ్ళనీళ్లపెట్టుకుంటే రావుగారు అతడిముఖాన్ని చూడలేకపోయారు.

ఊళ్ళోవుంటే యిక ఈగోలవినకతప్పదని ఆయన షికారుకని ఊరిబయటకువెళ్ళగా, అక్కడా యిలాటికేసే ఒకటి ఎదురుగావడంతో, బేజారెత్తిపోయి యింటికి తిరిగి వచ్చేశారు.

రావుగారి కాయం వాలుకుర్చీలో వాలిపోయివున్నా, ఆయన మనసు మాత్రం మనసులోలేదు. అది పెళ్ళిళ్ల సమస్యచుట్టూ ప్రదక్షిణం తిరుగుతోంది.

ఆయన చిరాకుతో పైకి లేచి అంగవస్త్రాన్ని, చొక్కాను తీసి కుర్చీ పైకి గిరవాటు వేసి గదిలో అటూ, యిటూ పచారుచేస్తూ ఉన్నట్టుండి తలపైకెత్తి "ఒరే సూర్యం, సుధాకరం" అని ఎలుగెత్తి కేక వేశారు.

అంతక ముందే ఆఫీసునుంచీ వచ్చి కాఫీ కోసం లోపలికి వెళ్ళిన సూర్యనారాయణ, డాబాపైన నిలబడి సంధ్యాసౌందర్యాన్ని అవలోకిస్తున్న సుధాకరం రావుగారి పిలుపు చెవులబడగానే గదిలోకి వచ్చేశారు.

"మీరు నాకోపని చేసిపెట్టాలి, రేపటి దినం సెలవురోజేం కాదుగదూ!" అంటూ ప్రారంభించారు రావుగారు. "ఇదిగో సూర్యం! నువ్వు ఆఫీసుకు వెళ్లగానే ఓ కాగితం తీసుకుని అక్కడపనిచేస్తున్న పెళ్ళికాని అబ్బాయిల పేర్లన్నీ చిరునామాతో సహా వ్రాసేయాలి, సాయంకాలంలోపల తీరికైనప్పుడు అలాగే డి.ఇ.ఓ. ఆఫీసు, ఆడిట్ ఆఫీసు డిస్ట్రిక్టుబోర్డు ఆఫీసుకు వెళ్లి జాబితా పూర్తిచేసేయాలి. నువ్వు సుధాకరం! డిస్ట్రిక్టుకోర్టు, మునిసిపల్ ఆఫీసూ, మిగిలిన కార్యాలయాలన్నీ నీవి! రేపీపాటికి జాబితాలు నాచేతిలోవుండాలి".

"ఎందుకు నాన్నా!' జంకుతూ మెల్లగా ప్రశ్నించాడు సూర్యనారాయణ.

"ఎందుకేమిటి! ప్రొద్దుపుట్టకముందే బ్లేడు పెట్టి, నున్నగా ముఖంగీచుకుని, చెరగని యిస్త్రీమడతలతో సిగరెట్టు కాల్చుకుంటూ వీధులవెంబడీ బయలుదేరితే సరిపోదురా బాబూ! ఈ వంశోద్ధారకులు చేయవలసిన పనులు చాలావున్నాయి. జాబితా చేతికి రానీ, వీళ్ళపని చెబుతాను."

♦ ♦ ♦

మరునాటి సాయంకాలం అన్నదమ్ములిద్దరూ మార్గమధ్యంలోనే కలసి యింటికి వచ్చేసరికి రావుగారు తమగదిలో కూచుని ఏదో వ్రాతపనిలో నిమగ్నులైవున్నారు.

"ఏమిటి నాన్నా అది?" అన్నాడు సుధాకరం, హనుమంతుడి తోకలాంటి జాబితాను బయటికితీస్తూ.

"వచ్చేశారా! కాసేపు నెమ్మదిగా కూచుని ఈఫారాన్నొకసారి క్రిందకీ మీదికీ చూచేయండి. సలహాలేవైనావుంటే నిస్సందేహంగా యిప్పుడే, బయటపెట్టవచ్చు." అన్నారు రావుగారు.

అన్నదమ్ములు టేబిలుపైకివంగి దీక్షగా ఫారాన్ని పరిశీలింపసాగారు.

పేరు : అవివాహితుడి సంజాయిషీపత్రం.

(ఎ) అవివాహితుడి పేరు :

(బి) తండ్రిపేరు :

(సి) చిరునామా :

(డి) పెళ్ళిచేసుకునే ఉద్దేశం వున్నదా? లేదా?

(ఉన్నట్టయితే 'ఉంది' అని, లేనట్టయితే 'లేదు' అని వ్రాయవలెను. 'లేదు' అని నమోదుచేసినవారు ఇంతటితో ఫారాన్ని మడిచిపెట్టి త్రిప్పిపంపవలెను.)

(ఇ) ఇప్పుడు నువ్వు పెళ్ళి చేసుకోవడానికున్న అభ్యంతరా లేమిటి?

(వివరంగా వ్రాయవలెను. అందుకీ కాగితం చాలకపోతే ఒక తెల్లకాగితం జతపరచుకోవచ్చును.)

(యఫ్) అవివాహితుడి సంతకం :

ఫారం చదివి ముగించి సూర్యనారాయణ సుధాకరం ముఖంలోకి చూచాడు. సుధాకరం సూర్యనారాయణ ముఖంలోకి చూచాడు. ఆక్షణాన ఒకరిముఖంలో మరొకరికి కనిపించింది, ఆశ్చర్యార్థకపు గుర్తో, ప్రశ్నార్థకపు గుర్తో వాళ్ళకు తెలియదు.

వాళ్ళింకా విస్మయావస్థలోనుంచీ తేరుకోకమునుపే రావుగారు "కాగితాలు తెప్పించివుంచాను. కార్బను పేపరుపెట్టి కావలసినన్ని కాపీలుతీసేయండి. రేపేపోస్టు చేసేయాలి" అన్నారు.

"ఎందుకునాన్నా! ఏదో కోర్టువ్యవహారంలాగా ఈపెళ్ళిళ్ళ విషయాన్ని కూడా వ్రాతకోతలతో ముడిపెట్టడం ఏం బాగుంటుంది? అంతగా అవసరమైతే ఒక్కొక్కరినీ వారగాపిలిచి అంతర్యమేమిటో అడిగి తెలుసుకుంటే పోదూ!" అన్నాడు సూర్యనారాయణ.

"అదే అంతర్యాన్ని కాగితంపైకెక్కించడం పెద్దనామోషీ పని కాబోలు! మీ సంస్కారాలు నా కర్థమై ఏడవ్వురా బాబూ! ఇది నాపద్ధతి. అంతే! మీరో అరగంటసేపు నాపనికోసం 'డివోట్' చేయండి. మిగిలిన పని నేను చూచుకుంటాను."

గొప్ప సమస్య ఒకటి పరిష్కారం కాబోతున్నదన్న సంతృప్తితో రావుగారో పొడుగాటి పొగచుట్ట వెలిగించారు.

◆ ◆ ◆

వారంరోజుల తర్వాత రాఘవేంద్రరావుగారు ప్రారంభించిన వ్యవహారంలో అంతిమఘట్టం, అనుకోనివిధంగా, అత్యద్భుతంగా, హఠాత్తుగా సంఘటిల్లింది.

ఉదయం పదిగంటలవేళ, ఆఫీసులో తొందరపనులున్నాయేమో, సూర్యం సుధాకరం కలిసినట్టుగా తొమ్మిదింటికే బయటికి వెళ్ళిపోయారు. రావుగారు పదిరోజులనుంచీ 'మెయింటైన్' చేస్తున్న పెళ్ళిళ్ల ఫైలును ఒడిలో వుంచుకుని, కత్తివాదరలా పదునెక్కిపోతున్న మండుటెండల్నీ చూస్తున్నారు.

ఆ వేళప్పుడు అలాకూచుని పోస్టుమేన్ కోసం ఎదురుచూడడం ఆయనకు మామూలే!

కానీ ఆ పోస్టుమేన్ కోసం నాలుగైదు రోజుల క్రిందట ఆయన ఎంత ఆసక్తితో, ఎంత కుతూహలంతోనైతే నిరీక్షించారో, యిప్పుడంతగా ఆయనలో ఉదాసీనభావం వేరూనుకపోయింది.

అందుకు కారణం లేకపోలేదు.

వివరాలను నమోదుచేసుకుని జట్లు, జట్లుగా తిరిగివచ్చిన అవివాహితుల సంజాయిషీ పత్రాలను పరిశీలించనూ, పరిశీలించనూ ఆయనకిక ఈ సమస్యను పరిష్కరించడం తనతరంగాదన్న విషయం యిటేలు తేలిపోయింది.

రావుగారు వేడెక్కిన బుర్రను చేతుల్లో వుంచుకుని సమస్య లోత్తుల్లోకి చొచ్చుక పోయే అంతర్దృష్టితో సుదీర్ఘంగా ఆలోచించారు.

ఈ అవివాహితులందరూ ఎంతో బుద్ధి మంతులు! పైపైకి 'లోకముతో మనకేటికి, అన్నట్టు బలవంతాన సాగిపోతున్న సంసార రథంలో వెనుకవైపున కూచుని ఎప్పుడో, ఎక్కడో క్రిందికి దూకి ఏ సుదూరసీమలకో పారిపోయే ఉద్దేశాన్ని ఎదలోదాచుకున్నట్టు కనిపించినా, నిజానికి వీళ్ళంతా నిర్లిప్తులు మాత్రం కారు! అందుకే బాహాటంగా అందరూ తమకయితే పెళ్ళిచేసుకునే సదుద్దేశం వుండనేవుందని ఏకగ్రీవంగా ఒప్పుకున్నారు. కానీ సంజాయిషీపత్రంలో నాలుగో అంశానికి నేరుగా 'పాజిటివ్' సమాధానం రావడంతోనే ఏమైంది? ఉన్న చిక్కంతా ఆ తరువాతి అంశంలోనే! అక్కడే ప్రతి అవివాహితుడూ గొంతుకలో వెలక్కాయపడ్డట్టు తబ్బిబ్బయిపోతూ, ఒకటి రెండు కుంటిసాకులు చెప్పి ఆఖరుకు ఉన్న పరిస్థితిని యధాతథంగా ఉదహరించి పథాంతర మేమిటన్న పెద్దప్రశ్నతో మానసికంగా కుస్తీ పట్టుతున్నాడు.

అసలు విషయం యిది: పెళ్లి కావలసిన అక్కచెల్లెండ్రు ఒక్కరో యిద్దరో లేని అవివాహితుడు మచ్చుకైనా కనపడ్డం లేదు. మొదట ఆడబిడ్డకు పెళ్ళయితీరాలి! తర్వాత నింపాదిగా మగవాడి మాట!

నిజమే! పెద్దలు, వాళ్ల పెద్దలనుంచీ అనూచానంగా వొస్తున్న సాంప్రదాయాన్ననుసరించి ఆడబిడ్డకు కాస్తా పెందలకడనే పెళ్ళి చేసేయడమేన్యాయం.

ఐతే ఆడబిడ్డ పెళ్ళికి, కట్నాలు కావాలి, కానుకలు కావాలి.

పెళ్ళికుమారుడి తల్లికి, తోబుట్టువులకూ మర్యాదలు జరగాలి.

ఈ అనవాయితీలన్నీ యధావిధిగా జరిగిపోవాలంటే డబ్బుకావాలి.

చేత డబ్బుంటేగానీ అమ్మాయికి పెళ్లిగాదు. అమ్మాయికి పెళ్ళిగానంతవరకూ అబ్బాయి పెళ్ళిమాట తలపెట్టేవారు లేరు.

పిచ్చికుదిరితేగానీ పెళ్ళికాదు. పెళ్ళయితేగాని పిచ్చి కుదరదు.

ఇప్పుడేంచేయాలి?

ఈ సమస్యను ఎలా పరిష్కరించాలి?

రావుగారి తల్లో ప్రశ్నలు సుడిగుండాల్లా హోరుమంటున్నాయి. గేటు తెరచుకుని పోస్టుమేన్ లోపలికివచ్చి ఆయనచేతికో కవరందించాడు.

పరధ్యానంగా కవరుచించి రావుగారు కంటిజోళ్ళు సవరించుకున్నారు.

కవరులోనుంచీ కాస్తా నిడుపాటి వుత్తరమే క్రింద రాలింది. రావుగారికళ్ళు రెండుమూడు, వాక్యాలవెంబడి పరుగెత్తాయో లేవో, ఆయన నిలువునా నిర్విణ్ణులైపోయారు.

రేయింబవళ్ళూ తను మూలవిరాట్టులా యింటిపట్టున నెలకొనివుండగా, ముఖాముఖిగా మాట్లాడుకోడం పోయి తన కుమారులే తనకొక ఉత్తరం వ్రాయగలరని ఆయన ఎన్నడూ ఊహించలేదు!

అలా వ్రాయవలసి వచ్చినందుకు క్షమాపణ కోరుతూనే ఉత్తరం ప్రారంభమౌతోంది.

"మహారాజశ్రీ నాన్న గారికి నమస్కారాలు.

ఈ ఉత్తరాన్ని చూడగానే మీకు ఆశ్చర్యమూ, దాని వెనువెంటనే కోపమూ కలగడానికి అవకాశం వుంది.

కానీ మీరు మమ్మల్ని మన్నించాలి.

ఏవో నోటిమాటలతో ఉబుసుపోకగా చెప్పదలచుకున్న విషయాన్ని కాగితం పై కెక్కించి నట్టయితే ఆ విషయానికి కొంత బరువు చేకూరుతుందని మీరే సెలవిచ్చారు. మాకు పాతికేళ్ళు తీరిపోయాయి. మీ వుద్దేశానికేనాడూ వ్యతిరిక్తంగా ప్రవర్తించినట్టు మాకు లీలా మాత్రంగానైనా జ్ఞాపకం లేదు.

ఇక ప్రస్తుత విషయాన్ని గురించి పది పదిహేనురోజులనుంచీ మీరు ఆడపిల్లల పెళ్ళిళ్ళను గురించిన ఆలోచనలతో సతమతమైపోతూ వుండడం మేము కళ్ళారా చూస్తున్నాం. నిజానికిది పద్మవ్యూహాల్లాంటి పెద్ద పెద్ద చిక్కుల్ని విడదీసి, ప్రభుత్వ వ్యవహారాల్లో ఢక్కా మొక్కీలు తిన్న మీ బోటి అనుభవజ్ఞులు చేయిజేసుకోవలసిన సమస్యే! కాని ఒక చిన్న విషయాన్ని మీ రిక్కడ గమనించాలి! "నేను సైతం ప్రపంచాబ్జపు తెల్లరేకై పల్లవిస్తాను" అన్న కోరిక ప్రతి సామాన్యునికీ వుంటుంది. సరిగ్గా మాదీ అలాటి కోరికే! ఈ మా తోడ్పాటుతో వివాహాల సమస్య పటాపంచలై, పంచబంగాళమై పూరుకుంటందని గాదు. మీ బోటి వారు వారధి మీద వారధి నిర్మించడానికి ప్రయత్నిస్తే, మేము వుడతాభక్తిగా యథోచిత సహకారం నెరపదలచుకోడం సమంజసం కాకపోదు.

అసలు విషయం యేమిటంటే మీతోబాటు మేముగూడా గత రెండువారాల నుంచీ ఈ పెళ్ళిళ్ళ సమస్యను గురించి తీవ్రంగా ఆలోచిస్తూనే వున్నాం.

పరిమితమైన మా లౌకిక విషయపరిజ్ఞానంతో ఈ సమస్యను మథించగా తేలిన సారాంశాన్ని మీకు తెలివిడీ చేసుకోవడానికే ఈ ఉత్తరం వుద్దేశింపబడింది.

ఒకటి: పెళ్లి అనే సాంఘిక ఆచారం ఆడపిల్లల కెంత అవసరమో, అబ్బాయిలకూ అంత అవసరమే! కానీ ఈడొచ్చిన అమ్మాయిని యింట్లో వుంచుకోడం లోకుల దృష్టిలో అగ్గిని ఒడిగట్టుకోడంలా భాసిస్తోంది. అందుచేత వయసు మీరిపోతున్నప్పటికీ కొడుకు నలా వుంచేసి, తలిదండ్రులు మొదట కుమార్తెకే శుభకార్యం జరిపేయాలని ఆశిస్తున్నారు.

రెండు: బాగా డబ్బున్నవాళ్లకు బొత్తిగా లేమిడికుటుంబాలకు ఈ వివాహాలు ఒక సమస్యగానే తోడచం లేదనిపిస్తోంది. శ్రీమంతులు ఎంతడబ్బయినా వెదజల్లి ఆకాశమంత పందిరి, భూదేవంత అరుగూ వేసి పెళ్లిళ్ళకు కొట్టి కోలాహలం చేస్తారు. పేదవాళ్లు ఉన్నంతలోకట్నాలు, కానుకల ప్రసక్తి లేకుండా ఏదో అయిందనిపించేస్తారు. తిండికీ బట్టకూ జీతంరాళ్లు అందదుకులుగా సరిపోయే మధ్యతరగతి కుటుంబాలను మాత్రమే ఈ వివాహ సమస్య భీషణంగా ఎదుర్కొంటోంది. అది మంచికో, చెడ్డకో చెప్పలేముగానీ మనదేశంలో ఈ మధ్యతరగతి కుటుంబాలే హెచ్చు!

మూడు: పోనీ, కుమారుడికి పెళ్ళిచేస్తే కట్నం వస్తుందిగదా ఆ కట్నంతో అల్లుడ్ని ఎందుకు తెచ్చుకోగూడదని యిక్కడ ప్రతివాదం పైకిరావడానికి వీలుంది. కానీ కాస్త కదిలించిచూస్తే యిదీ బొత్తిగా బలంలేని వాదమేనని తేలిపోతుంది. కూతుర్ని ఓ మెట్టు పై కుటుంబంలో యివ్వాలనీ తమకు అణగి మణగి వుండడంకోసం కోడల్ని ఓమెట్టు క్రింది కుటుంబంలో నుంచీ తెచ్చుకోవాలని తలిదండ్రులు వాంఛిస్తారు. ఈ పరిస్థితుల్లో కూతురిపెళ్ళికి తమ తాహతుకుమించిన కట్నాన్ని యివ్వవలసివచ్చి వీళ్ళెంతగా ధనాభావానికి గురౌతారో, కుమారుడి పెళ్ళికి అటువైపున అతడి అత్తగారి కుటుంబమూ సరిగ్గా అలాటి యిక్కట్టుకే గురౌతోంది. ఈ విషయం అటుండగా, కుమారుడి పెళ్ళికట్నం, ఆ పెళ్ళిలోనే సగానికి పైగా వ్యయమైపోతోంది. మిగిలిన డబ్బును తన్నుకుపోవడానికి రాబందుల్లాంటి అవసరాలు కాచుకుని వుండనేవుంటాయి.

నాలుగు: కాగాపోగా ఇక ఈ పెళ్ళిళ్ళన్నీ సజావుగా జరిగిపోవాలంటే అందుకు ఒకే ఒక్కమార్గం మాత్రం వుంది. ఇదేమిటో అందరికీ తెలుసు! కానీ విచిత్రమేమిటంటే, యింత సులభమైన పద్ధతిని ఆచరణలోపెట్టి ఇటు తామూ, అటు ఎదుటివాళ్ళు సాఫీగా సంసారాల్ని లాక్కుపోవడానికి బదులు అందరూ కట్నాలనీ, కానుకలనీ చేజేతులా చిక్కుల్ని కొనితెచ్చుకుంటున్నారు.

రోగానికి మూలకారణమేదో గుర్తెరిగి, దాన్ని అక్కడినుంచే తుడిచిపెట్టే వైద్య ప్రక్రియ చాలా మంచిదన్న విషయాన్ని మీరు ఒప్పుకున్నట్టయితే, ఈ వివాహాల అలజడికి మూలకందమైన కట్నాలతంతును సమూలంగా నాశనం చేయాలన్న మా నిర్ణయంతో ఏకీభవించకపోరు!

కానీ మనం నిర్ణయాలు చేసుకున్నంత మాత్రాన సంఘానికి పెద్ద లాభం చేకూరి పోదు.

కట్నం 'డిమాండ్' చేయడాకి అన్ని అర్హతలు కలిగివున్నా, దాన్ని నిరాకరించి, నలుగురికి ఆదర్శ ప్రాయంగా కార్యాచరణ చేసి చూపెట్టడానికి మీవంటి విజ్ఞులు ముందుకురావాలి.

ఇక్కడ స్వయానా మీ చెల్లెలికి (మా మేనత్తకన్నమాట!) యిద్దరు కూతుళ్ళున్నారనీ, ఒకప్పుడు బాగా బ్రతికినా యిప్పుడా కుటుంబం అల్లుళ్ళకు కట్నాలిచ్చే అంతస్థులో లేదనీ యిక్కడ మీకు విన్నవించుకోడం సముచితంగాకపోదని మా ఆశ!

మీరు చేబట్టిన ఆడపిల్లల పెళ్ళిళ్ళనే మహోద్యమానికి ఈ మా ముందంజ అంకురార్పణంగా పరిణమిస్తే అంతకంటే మాకు సంతోషకరమైన విషయం మరొకటి వుండబోదు.

(ఆంధ్రప్రభ - సచిత్రవారపత్రిక) 17-07-1957

❀ ❀ ❀